క్లుప్తంగా

18న రాష్ట్ర సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 18న కడపలో కృష్ణాజలాల వివాదంపై 'ఏపీ- తెలంగాణా రాష్ట్రాలకే పరిమితం చేస్తూ బీజేపీ పునఃపంపిణీ కుట్రలను తిప్పికొడదాం.. రాష్ట్ర నీటి హక్కులను కాపాడుకుందాం' అంటూ నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి, యం.వి సుబ్బారెడ్డి, ఎస్ వెంకట శివ, వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ విద్యార్థులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అమ్మ ఒడి కింద ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఇస్తున్న నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ మల్లికార్జున డిమాండ్ చేశారు. జీఓ 77 రద్దు చేయాలని కోరారు. మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి పెంచలయ్య, నాయకులు రాజు, శ్యామ్ సుందర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మదనపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా అండర్-19 క్రీడాకారులు సత్తాచాటారు. అండర్-19 బాలికల విభాగంలో ప్రథమస్థానం, బాలుర విభాగంలో మూడోస్థానం సాధించడంతో పాటు పలువురు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మంగళవారం కడప నగరంలోని ఇంటర్మీడియట్ కార్యాలయం వద్ద ఆర్‌జేడీ రవి, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐఓ రమణరాజులు అభినందించారు. అనంతరం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సేతుమాధవ్, పి. విఘ్నేశ్వర్‌రెడ్డి, భానుశ్రీ, భావన, సావిత్రి, మనీషలను వారు అభినందించారు.

జిల్లా కేంద్రంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నిర్మించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా కేంద్రంలో రిజిస్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ కేటాయించిన పాత రిమ్స్ లో నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షులు సంజీవ రాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు నగరంలోని పాత రిమ్స్ వద్ద ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలి



డ్రగ్స్ అనర్థాలను వివరిస్తున్న నాగలక్ష్మి

వైవీయూ : డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి కోరారు. మంగళవారం కడప నగరంలోని ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో 'యాంటీ డ్రగ్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులే భావిభారత పౌరులని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వాడితే కలిగే అనర్థాలను వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎస్ఈబీ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు గొప్పగా ఉంటున్నాయని, అయితే వాటిని ఆచరణలో పెట్టడంలో సఫలం కావడం లేదన్నారు. మంచి స్నేహితున్ని ఎంపికచేసుకుని జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. వీరసుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. మంగళవారం కళాశాల వ్యాయామ విద్య, క్రీడాశాస్త్ర విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి క్రీడాకారులకు క్రికెట్ కిట్, వాలీబాల్స్, బ్యాడ్మింటన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, మాజీ అధ్యక్షుడు డా. రంగనాథరెడ్డి, ఆల్ఫోన్స్‌బాబు, కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ టి. హజరతయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా

కడప కార్పొరేషన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేసి ఆరోగ్యవంతమైన జీవితం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాత రిమ్స్‌లోని రాధాక్రిష్ణ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కో ఆపరేటివ్ కాలనీ, జీడీఎస్ స్ట్రీట్, రాధాక్రిష్ణ నగర్, శంకరాపురం ప్రాంతాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష 7వ క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో మహిళలకు సంబంధించి గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్ డాక్టర్లు, చిన్నపిల్లల నిపుణులు ఉన్నారని, కంటికి సంబంధించి, ఇతర ఐదు మంది డాక్టర్లు కూడా ఉన్నారన్నారు. ఈ శిబిరంలో వారికి సంబంధించిన 11 రకాల పరీక్షలను కూడా నిర్వహించి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. తొలుత డిప్యూటీ సీఎం 'ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రతి స్టాల్‌ను పరిశీలించి, వైద్యులతో, సిబ్బంది తో అక్కడికి విచ్చేసిన రోగులతో వివరాలు అడిగి తెలుసుకొని కొన్ని సూచనలు చేశారు. రోగులను పరీక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆ తర్వాత రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు సూర్యనారాయణ రావు, షఫీ, కో ఆప్షన్ సభ్యు రాలు పత్తిరాజేశ్వరి, 24వ డివిజన్ ఇన్‌చార్జి మేసా ప్రసాద్, సీహెచ్ వినోద్, శివానాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తగ్గుముఖం

కడప కార్పొరేషన్ : ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల వల్ల సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కారం అవుతుండటంతో తమ వద్దకు వచ్చే సమస్యలు చాలా వరకు తగ్గాయని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి తెలిపారు. మంగళవారం కడప విద్యుత్ భవన్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రత్యేక విద్యుత్ అదాలత్' నిర్వహించారు. విద్యుత్ సమస్యలపై ముగ్గురు వినియోగదారులు ఫిర్యాదు చేయగా వారి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ సమస్యలను తిరుపతి శ్రీనివాస పురంలోగల విద్యుత్ నిలయానికి పంపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.రమణ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మెంబర్ ఫైనాన్స్ రామ్మోహన్‌రావు, టెక్నికల్ ఎస్ఎల్ అంజనీ కుమార్, మెంబర్ కన్స్యూమర్ అఫైర్స్ ఈశ్వరమ్మ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఉపయోగకరం

వైవీయూ : విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇంటర్న్‌షిప్ ఎంతో దోహదం చేస్తుందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న డిగ్రీ విద్యార్థినులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. గురివిరెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు.

జిల్లా కళాశాలలకు అభినందన



ప్రశంసాపత్రం అందుకుంటున్న వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్

వైవీయూ : నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ (న్యాక్) గ్రేడింగ్‌లో జిల్లాకు చెందిన పలు కళాశాలలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకింగ్ కనబరిచారు. కడప నగరానికి చెందిన శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, శ్రీహరి డిగ్రీ కళాశాల, కమలాపురానికి చెందిన సీఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలు న్యాక్ గ్రేడింగ్‌లో ఏ గ్రేడ్ సాధించాయి. వీరికి మంగళవారం విజయవాడలో ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జ్ఞాపికలు, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలను వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏపీ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డీఎస్ఆర్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరానికి చెందిన అమ్ము తవల్లి ప్రకాశ్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి నగరంలోని పలు కూడళ్లలో ఉంటున్న అనాథలకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత నుంచి ప్రతిరోజు 50 ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్నామన్నారు. దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలని కోరుకుంటున్నామన్నారు.

బుగ్గవంక పక్కన రోడ్లను పూర్తి చేయాలి



మార్నింగ్ విజిట్‌లో భాగంగా అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: బుగ్గవంక పక్కనున్న అప్రోచ్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. మంగళవారం ఉదయం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన బుగ్గవంక, కేసీ కెనాల్, ఏడురోడ్ల కూడలి, జిల్లా పరిషత్, మరియాపురం ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా బుగ్గవంక పక్కన 40 అడుగులతో నిర్మిస్తున్న రోడ్డు, డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రవీంద్ర నగర్ గంగమ్మ గుడి వద్ద నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలన్నారు. కేసీ కెనాల్ వద్ద 33 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఆక్రమణల తొలగింపు పూర్తయిన వెంటనే డ్రైనేజీ కాలువ పనులను మొదలు పెట్టాలన్నారు. రైతు బజార్ వద్ద నుంచి జిల్లా పరిషత్ మీదుగా లక్ష్మి రంగ సర్కిల్ వరకూ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు.

ప్రశాంత జీవితం గడపాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత బిజీ జీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతుంటారని, టెన్షన్‌కు దూరంగా ప్రశాంత జీవితాన్ని గడపాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డెఫెన్స్ కౌన్సిల్ మనోహర్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత రిమ్స్‌లోని విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రంలో లీగల్ ఎయిడ్ డెఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్‌షిఫా వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

తొలి దశలో గుర్తిస్తే కాన్సర్‌ను జయించవచ్చు



కాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఫాదర్ సుధాకర్

కడప కల్చరల్ : కాన్సర్ సోకడాన్ని తొలి దశలో గుర్తించగలిగితే నయమవుతుందని, దాని గురించి భయం అవసరం లేదని పునీత జోసెఫ్ తెలుగుమీడియం హైస్కూలు ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సుధాకర్ అన్నారు. కడప నగరం మరియాపురంలోని మల్టీపర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బాలరాజు ఆధ్వర్యంలో మంగళవారం హైస్కూలులో జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, శ్రీధర్‌ల పర్యవేక్షణలో కాన్సర్ పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఫాదర్ సుధాకర్ మాట్లాడుతూ కాన్సర్ వ్యాధి కంటే అది సోకిందన్న భయనే మనిషిని కుంగదీస్తుందని, భయాన్ని దూరం చేసుకుని తొలిదశలో దాన్ని గుర్తించగలిగి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందితే కాన్సర్ కూడా తప్పక నయం అయ్యే వ్యాధి అని పేర్కొన్నారు.



అంతరిక్ష అంశాలపై అవగాహన పెంచుకోవాలి

వైవీయూ : అంతరిక్ష అంశాలపై ఆసక్తి, అవగాహన పెంపొందించుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ సూచించారు. మంగళవారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా కళాశాల ఫిజిక్స్ విభాగం, జనవిజ్ఞానవేదిక సంయుక్త ఆధ్వర్యంలో అంతరిక్ష అంశాలపై ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు రఘునాథ రెడ్డి, నగర కార్యదర్శి శివరాం, భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బయపురెడ్డి, భూషణ్‌రెడ్డి, నాగేశ్వరరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్: మానసిక ఆరోగ్యం అనేది సార్వత్రిక మానవ హక్కు అని కడప ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం మంగళవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల (రిమ్స్) ఐపీలోని లెక్చర్ గ్యాలరీలో నిర్వహించారు. మానసిక విభాగం సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరాముడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవం జరుపుకుంటారన్నారు. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న, ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ యాదవేంద్రారెడ్డి, అధికారులు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ గీత, మానసిక విభాగం డాక్టర్లు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో పనిచేస్తున్న ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లను సన్మానించామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం డీఎం కార్యాలయంలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారితో కలిసి బాబు, ఎస్ఆర్ కృష్ణ, రవిశేఖర్‌రెడ్డి, గణేష్‌సింగ్, వరకుమార్‌లను ఘనంగా సత్కరించారు.

బీజేపీని బలోపేతం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నాయకులు, కార్యకర్తలు బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జిల్లా పదాధికారులతో సమావేశం నిర్వహించారు. శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా బాధ్యులు దుద్దుకుంట వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు పుప్పాల శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కోశాధికారిగా మునగా సతీష్

బీజేపీ వైఎస్సార్ జిల్లా కోశాధికారిగా మునగా సతీష్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు.

